

# ప్రియరాగాలు

» సంగీత ప్రపంచంలో సుస్వరాల సిస్టర్స్ » కర్ణాటక సంగీతంలో అలుపెరగని ప్రతిభ
» చదువులోనూ అంతకంతకూ ఎదుగుతూ..

**ప్రియా సిస్టర్స్.. తమ ప్రియమైన మృదుమధుర గానంతో కృష్ణాతీరంలో మలయమారుతాలై ప్రతిధ్వనిస్తున్నారు. సంప్రదాయ రీతిలో శాస్త్రీయ సంగీతాన్ని అభ్యసిస్తూ.. సంగీత పరిజ్ఞానంతో ఒక్కో మెట్టు ఎక్కుతూ.. నిష్ణాతులైన కళాకారుల ఆశీర్వచనాలు అందుకుంటూ.. కర్ణాటక సంగీతాన్ని గాత్ర యుగళంగా సాగిస్తున్న వీరు ఎంతోమంది సంగీత ఉద్దండుల ప్రశంసలు పొందుతున్నారు. అటు సంగీతాన్ని, ఇటు చదువును రెంటినీ సమన్వయం చేసుకుంటున్న ఈ కవలల విజయ ప్రస్థానం నేటి 'సరిగమలు'లో..**



**విజయవాడ కల్చరల్ :** బెజవాడ ప్రియా సిస్టర్స్‌గా పేరొందిన యువ గాయనీమణులు కప్పగంతుల హరిప్రియ, కప్పగంతు షణ్ముఖప్రియ పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ పూర్తిచేశారు. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన వారికి సంగీతం పట్ల చిన్నమ్మ ఆసక్తిని కలిగించింది. పాటలు, శ్లోకాలు నేర్పించింది. పండుగలు, ఉత్సవాల సమయాల్లో బంధువులందరూ కలిసినప్పుడు ఆడుకునే అంత్యాక్షరి వారిలో సంగీతం నేర్చుకోవాలన్న స్ఫూర్తిని నింపింది. అమ్మ కప్పగంతుల జాహ్నవిదేవి చిన్నారులకు సంగీత సంప్రదాయాలు నేర్పించాలని బాల్యంలో సత్యసాయి బాల వికాస్‌లో చేర్పించారు. ఇక్కడ ప్రతి ఆదివారం భజనలు చేయిస్తూ పురుష సూక్తం, శ్రీసూక్తం, లలిత, విష్ణు సహస్రనామాలు, గణపతి అధర్వణ శీర్షిక, భగవద్గీత 18 అధ్యాయాలు, అనేక ఆధ్యాత్మిక అంశాలు నేర్పించారు.

## సంగీత ప్రయాణం ఇలా..

ఆ తరువాత తొమ్మిదో తరగతి చదివే సమయంలో సుశీలా గోపాలం వద్ద సంగీత శిక్షణ ప్రారంభించారు. ఏడాది పాటు నేర్చుకున్న తరువాత పదవ తరగతి, ఇంటర్మీడియెట్ సమయంలో మూడేళ్ల పాటు సంగీత శిక్షణ నిలిపివేసి చదువుపై ఏకాగ్రత పెట్టారు. డిగ్రీ ప్రారంభంలో శ్రీనివాసమూర్తి వద్ద సంగీత శిక్షణ (డిప్లొమా) పూర్తి చేశారు. ప్రస్తుతం ఎంఏ సంగీతం చేసేందుకు ప్రయత్ని స్తున్నారు. డిప్లొమా చేసే సమయంలోనే కచేరీలు మొదలుపెట్టారు. యావరేజ్ స్టూడెంట్‌గా ఉన్న మేము సంగీతం నేర్చుకున్న తరువాత చదువుపై ఆసక్తిని పెంచుకున్నామని, 75-80 శాతం మార్కులు సంపాదించే స్టూడెంట్స్‌గా మెరుగులు దిద్దుకున్నామని ప్రియా సిస్టర్స్ చెబుతారు. చదువే సరిగ్గా రాదు, ఇక సంగీతం ఏం వస్తుంది, అనవసరంగా సమయం వృథా చేయొద్దు అని ఎంతో మంది వారిద్దరినీ నిరుత్సాహపరిచారు. అయినా సంగీతంపై దృష్టిసారించి పాడటం నేర్చుకున్నారు. గురువు పట్ల భక్తిశ్రద్ధలు, సంగీతం పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకుని సంగీత రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తున్నారు.

ఇంటర్మీడియెట్ చదువుకునే సమయంలో కేబీఎన్ కళాశాలకు చెందిన లెక్చరర్ మనోహర్ వారి పేదరికాన్ని గమనించి ఉచితంగా ట్యూషన్ చెప్పారు. ఆ తరువాత ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్‌వోడీ విజయ్‌దుర్గ ప్రసాద్ అనేక సార్లు కళాశాల ఉత్సవాల్లో, ఫెస్టివల్స్‌లో పాడించి ప్రోత్సహించేవారు. కళాశాలలో చదివే రోజుల్లో దాదాపు 40 సార్లు వేదికపై వారి గానాన్ని వినిపించారు. ప్రియా సిస్టర్స్ ప్రతిభను గుర్తించిన జిజ్ఞాస సంస్థ 'యువ కళా సమ్మాన్' బిరుదునిచ్చి సత్కరించింది.





జిజ్ఞాస సంస్థ నుంచి యువ కళా సమ్మాన్ అవార్డు అందుకుంటూ..

## ఎన్నో వేదికలపై..

సంగీత నిష్ణాతులు పోపూరి గౌరీనాథ్, మోదుమూడి సుధాకర్, పప్పు సదాశివశాస్త్రి, సీవీపీ శాస్త్రి, చంద్రపవన్, రామలక్ష్మి తదితరులు ఎన్నో కచేరీలకు అవకాశమిచ్చి ప్రోత్సహించారు. సద్గురు సంగీత సభ, త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలతో పాటు సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు, సంగీత దర్శకుడు కీరవాణి పర్యవేక్షణలో జరిగిన 'అన్నమయ్య పాటకు పట్టాభిషేకం'లో బృందగానం చేశారు. నాటి సీఎం చంద్రబాబునాయుడు సభల్లో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతాన్ని పలుమార్లు మధురంగా ఆలపించి ప్రశంసలందుకున్నారు. ఆకాశవాణి రేడియోలో యువవాణికి ఎంపికయ్యారు. దూరదర్శన్‌లోనూ కచేరీలు చేశారు. గాత్రంతో పాటు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజున్ వద్ద వీణ సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశారు. డిప్లొమా కోర్సు చేస్తున్నారు. వివిధ వేదికలపై పలు సత్కారాలు అందుకున్నారు.

## ఏదో ఒక కళలో ప్రవేశం ఉండాలి

విద్యార్థులు ఏదో ఒక కళలో ప్రవేశం చేసి తీరాలనేది నా భావన. కళను నమ్ముకుంటే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుంది. ఎంత తెలిసినా తెలియనిదేదో ఉందన్న జిజ్ఞాస నేర్పుతుంది. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గొప్ప లక్షణాన్ని ఇస్తుంది.

**- కప్పగంతుల హరిప్రియ**

## నా పూర్వజన్మ సుకృతం

సంగీతంలో షణ్ముఖ ప్రియరాగం ఉండేది. ఆ రాగం పేరిటే నాకు నామకరణం చేశారు. సంగీతం నేర్చుకోవడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. సంగీత సాగరంలో నేను ఒక దోసెడు మాత్రమే తెలుసుకున్నాను. ప్రాథమిక స్థాయిలో కలిగిన అనుభూతే చాలా గొప్పగా ఉంది. సంగీతం, నృత్యం వంటివి నేర్చుకుంటే ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయి.

**- కప్పగంతుల షణ్ముఖప్రియ**

## దుర్గగుడిలో ఆర్జిత సేవలు



- వేకువ జాము 3.00 - 4.00 గంటల మధ్య సుప్రభాత సేవ, గుడిచుట్టూ ప్రదక్షిణలు. 4.00 నుంచి వస్త్రాలంకరణ సేవ.. ఖడ్గమాలాచార్చన (12 మంది భక్తులకు మాత్రమే అనుమతి)
- ఉ.6 గంటలకు, సా.5 గంటలకు త్రికాలార్చన.
- ఉదయం 7.30 నుంచి 9.30 వరకు రాజగోపుర ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, యాగశాలలో చండీహోమం పూజలు.
- ఉదయం 9 - 11 గంటల మధ్య పాత ఆశీర్వచన మండపంలో గంగా, పార్వతీ (దుర్గా) సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం.
- ప్రతి శుక్రవారం సా.7 - 8 గంటల మధ్య రాజగోపుర ప్రాంగణంలో ఆది దంపతులకు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య దర్బారు సేవ.
- ప్రతి రోజూ రాహుకాల సమయంలో రాహు-కేతు పూజలు (సోమవారం ఉదయం 7.30 నుంచి 9.00 వరకు)
- ప్రతి రోజూ రాత్రి 9 - 9.30 మధ్య అద్దాల మండపంలో గంగా, పార్వతీ (దుర్గా) సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పవళింపు సేవ (ఏకాంత సేవ).

# ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం

**కొత్త, పాత ఆసుపత్రులను సందర్శించిన కలెక్టర్ ఇంతియాజ్**



ప్రభుత్వాసుపత్రి వైద్యులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఇంతియాజ్

**ప్రభుత్వాసుపత్రి, జూన్ 6 :** కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రులను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ఇంతియాజ్ పేర్కొన్నారు. నగరంలోని కొత్త, పాత ప్రభుత్వాసుపత్రుల్లో గురువారం కలెక్టర్ ఇంతియాజ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికే ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాబూలాల్ బాగా పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. ఆసుపత్రిలో పలు పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయితే రోగులకు మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆసుపత్రిలో 382 పోస్టులకు అనుమతి ఉండగా, 280 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారన్నారు. త్వరలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్, ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ ప్రారంభిస్తామని చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ బ్లాక్ అందుబాటులోకి వస్తే మరిన్ని వైద్య సౌకర్యాలు ప్రజలకు అందుతాయని, అదేవిధంగా ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులకు వైద్యం సరిగ్గా అందుతుందా, లేదా? అని రోగులను కలెక్టర్ ఆరా తీయగా, వైద్యం బాగా అందుతోందని, ప్రతి అరగంటకు ఒక వైద్యుడు యోగక్షేమాలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ఫార్మసీ, ల్యాబ్ సెంటర్, ఇన్‌పేషెంట్ బ్లాక్స్, సర్జికల్ వార్డు, మందుల ప్రధాన స్టోర్స్, డయాలసిస్ సెంటర్, కార్డియాక్ సెంటర్‌లను పరిశీలించి ఆసుపత్రి సూపరింటెండెంట్ బాబులాల్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంవో నాయక్, డాక్టర్ శోభ, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.